501) సాళంగనాట/అఠాణ

ప॥ నరుడా యీతడు ఆదినారాయణుడుగాక। ధరణి గిరితికెక్కె దశరథసుతుడు॥

చ॥ యీతడా తాటకి జంపె నీమారీచసుబాహుల। సీతడా మదమణచె నిందరు జూడ।
యేతులకు హరివిల్లు యీతడా విరిచి యట్టె। సీత బెండ్లియాడెను యీచిన్నరాముడా॥

చ॥ చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యుల జంపి। అప్పు డిట్టె వాలి నేసినాత డీతడా।
గుప్పించి కోతుల నేలి కొండల జలధి గట్టి। కప్పి లంక సాధించె నీకౌసల్యానందనుడా॥

చ॥ రావణాదులను జంపి రక్షించి విభీషణుని। భావించ యయోధ్య నీతడు పట్టమేలెను।
శ్రీవేంకటేశు డితడే సృష్టి రక్షించె నితడే। యీవల మాపాలనున్న యీరామచంద్రుడా॥